www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 19 | ఆగస్టు | 2026
పేజీలు : 8

## చౌక దుకాణాల్లో నో రైస్..!
-దుకాణాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



2 లో

# శృతి మించిన వైద్య వ్యాపారం..!

- నిబంధనలకు తిలోదకాలు
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ
- ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రుల నిర్వహణ



ఖమ్మం నగరం వైద్య హబ్‌గా మారింది. అన్ని రకాల వైద్యాన్ని సకాలంలో అందించేందుకు అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రులు నెలకొల్పారు. ఖమ్మం వైద్య హబ్‌గా రూపుదిద్దుకునేందుకు ఎందరో వైద్యులు అవిరళ కృషి చేశారు. నిస్వార్థంతో వైద్య సేవలు అందించడం వల్లే ఖమ్మం ఈనాడు వైద్యరంగంలో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. కానీ ఇటీవల వైద్యం అతి లాభసాటి వ్యాపారంగా మారింది.ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. వైద్యానికి తగిన రీతిలో ఫీజులు వసూలు చేయడాన్ని రోగులు సైతం తప్పుపట్టరు కానీ రకరకాల పేర్లతో రోగులను పీల్చిపిప్పి చేసే విధానాన్ని నిరసించక తప్పని స్థితి. ఇప్పుడు వైద్యం కోసం వస్తే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగుల సంక్షేమం కంటే వారి వద్ద నుంచి ఎంత పిండుకోవచ్చునన్న ఆలోచనే ఈ పరిస్థితికి కారణం అవుతుంది. సాధారణ జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన రకరకాల వైద్య పరీక్షలు రాసి ల్యాబుల చుట్టూ తిప్పి వేల రకాల బిల్లులు వసూలు చేస్తున్నారు.

-ప్రజాపక్షం/ఖమ్మం




2 లో

## జర చూడండి సారూ..



-నెలలు గడిచినా చివరి బిల్లు రాకపాయే..
-బిల్లు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
-అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నామంటున్న పేదలు

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గూడు కల్పించేందుకు ఇందిరమ్మ పేరుతో పక్కా ఇండ్లను మంజూరు చేసే పథకాన్ని తలపెట్టింది. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి లబ్దిదారుల దరఖాస్తులను ఎల్1, ఎల్2, ఎల్3 లుగా వర్గీకరించింది. మొదటి విడతగా ఎల్ 1లో భాగంగా స్థలం ఉండి ఇండ్లు లేని పేదలకు ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తూ ఒక్కో ఇంటికి రూ.5.40 లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని విడతల వారీగా ఇంటి నిర్మాణంలో వివిధ దశలను బట్టి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. బేస్‌మెంట్, శ్లాబ్ లెవల్, ఇల్లు పూర్తయిన తర్వాత మిగిలిన మొత్తాన్ని అందించేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలుత పైలెట్ ప్రాజెక్టు క్రింద వివిధ గ్రామాల్లో మొత్తం 852 ఇండ్లను మంజూరు చేసింది. ఆ తర్వాత ఐదు నియోజక వర్గాల పరిధితో పాటు కామేపల్లి మండలంతో కలిపి 15,557 ఇండ్లను మంజూరు చేయడంతో మొత్తంగా

మిగతా 2లో..

## అంతా ఎక్సైజ్ కనుసన్నల్లోనేనా..?






-సమయపాలన లేని విక్రయాలు
-గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
-అధిక ధరలకు మద్యం విక్రయాలు
-మామూళ్ల ఆరోపణలపై విచారణకు డిమాండ్

ప్రజాపక్షం/తల్లాడ : మండలంలో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలకు నిర్ధిష్ట సమయం ఉన్నప్పటికీ...తల్లాడలో మాత్రం రాత్రి, పగలు తేడా లేకుండా 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వైన్ షాపుల సమీపంలోనే బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి గడువు దాటిన తర్వాత కూడా విక్రయాలు కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. తల్లాడ మండల కేంద్రంలో టెండర్ ద్వారా రెండు మద్యం దుకాణాలు కేటాయించగా...వాటిలో ఒక దుకాణం నుంచి సాధారణ విక్రయాలతో పాటు బెల్ట్ షాపులకు సరఫరా జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సులభంగా ఏ సమయంలోనైనా లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధిక ధరలకు విక్రయాలు...

బెల్ట్ షాపుల్లో మద్యం అసలు ధర కంటే అధికంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.20లు, బీర్‌పై రూ.20లు వరకు అదనంగా వసూలు చేస్తున్నారని

మిగతా 2లో..

# శృతిమించిన వైద్య వ్యాపారం..!



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరం వైద్య హబ్‌గా మారింది. అన్ని రకాల వైద్యాన్ని సకాలంలో అందించేందుకు అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రులు నెలకొల్పారు. ఖమ్మం వైద్య హబ్‌గా రూపుదిద్దుకునేందుకు ఎందరో వైద్యులు అవిరళ కృషి చేశారు. నిస్వార్థంతో వైద్య సేవలు అందించడం వల్లే ఖమ్మం ఈనాడు వైద్యరంగంలో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. కానీ ఇటీవల వైద్యం అతి లాభసాటి వ్యాపారంగా మారింది.ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. వైద్యానికి తగిన రీతిలో ఫీజులు వసూలు చేయడాన్ని రోగులు సైతం తప్పుపట్టరు కానీ రకరకాల పేర్లతో రోగులను పీల్చి పిప్పి చేసే విధానాన్ని నిరసించక తప్పని స్థితి. ఇప్పుడు వైద్యం కోసం వస్తే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగుల సంక్షేమం కంటే వారి వద్ద నుంచి ఎంత పిండుకోవచ్చునన్న ఆలోచనే ఈ పరిస్థితికి కారణం అవుతుంది. సాధారణ జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన రకరకాల వైద్య పరీక్షలు రాసి ల్యాబుల చుట్టూ తిప్పి వేల రకాల బిల్లులు వసూలు చేస్తున్నారు.ఆ తర్వాత మందుల దుకాణం వద్దకు వెళితే వేలల్లో బిల్లులు రావాల్సిందే. ఇప్పటికీ కొంత మంది వైద్యులు అసాధారణ రోగాలకు సైతం సాధారణ రీతిలోనే వైద్యం చేస్తూ రోగులు త్వరగా కోలుకునేలా చేయడంతోపాటు ఆర్థికంగా కూడా ఇబ్బందులు పెట్టని రీతిలో వైద్యం చేస్తున్నారు. ల్యాబుల వద్ద కమిషన్, మెడికల్ షాపుల వద్ద కమిషన్, వైద్యం కోసం అధిక ఫీజులు ఇవే లక్ష్యాలుగా కొన్ని ఆసుపత్రుల నిర్వహణ జరుగుతుంది. వీటన్నింటిని నియంత్రించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ చోద్యం చూస్తుంది. ఎవరు ఆసుపత్రి పెట్టుకున్న అక్కడ వైద్యులు ఎవరైనా ఫీజుల వివరాలు ఎలా ఉన్నా వైద్య ఆరోగ్య శాఖకు పట్టడం లేదు. రోగుల ఇబ్బందుల కంటే ఆసుపత్రులనుంచి వచ్చే కమిషన్ల పైనే వైద్య ఆరోగ్యశాఖకు మక్కువ. వైద్యం చేసేది ఒకరు, పేరు మరొకరిది. ఇది గుండె ఆపరేషన్ అయినా, సాధారణ వైద్యం అయినా అసలు డాక్టర్ అందుబాటులో లేకున్నా మరో వైద్యుడు వైద్యం చేసి లేని డాక్టర్ పేరుతోనే మందులు రాయడం ఇప్పుడు ఖమ్మంలో షరామామూలైంది.ఇటీవల గుండె నొప్పితో ఓ వ్యక్తి ఆసుపత్రికి రాగా వెంటనే స్టంట్ వేయాలంటూ హడావుడి చేశారు. తీరా ఆ ఆసుపత్రిలో పనిచేసే కార్డియాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో మరో ఆసుపత్రి నుంచి కార్డియాలజిస్టును పిలిపించి వైద్యం చేయించారు. బాగానే ఉంది. కానీ ఆపరేషన్ నిర్వహణ, మందులు ఇదంతా కూడా విధుల్లో లేని ఓ వైద్యుని పేరు మీద ఉండటం గమనార్హం. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి రోజు ఖమ్మంలో నిత్యకృత్యమయ్యాయి. ఆసుపత్రికి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్దామంటే వైద్యులు అందుబాటులో లేకపోవడం, సరైన మందులు ఉండడం లేదన్న ప్రచారం వెరసి ప్రైవేటు ఆసుపత్రులకు డిమాండ్ పెరిగింది. వైద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుండడంతో అనేక మంది వైద్య వ్యాపారం వైపు అడుగులు వేస్తున్నారు. అర్హత ఉన్నా లేకున్నా ఎవరో ఒక వైద్యున్ని పట్టుకొచ్చి డబ్బు పోగేసుకునే పనిలో ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఏ ఆసుపత్రిలో ఎంత మంది పనిచేస్తున్నారు, వారి అర్హతలు ఏమిటి, అసలు ఏ వైద్యం చేస్తున్నారో వైద్య ఆరోగ్య శాఖకే అర్థం కానీ స్థితి. ఖమ్మంలో అనుమతులు ఉన్న ఆసుపత్రులు ఎన్ని, ఎటువంటి అనుమతులు తీసుకున్నారు, ఎటువంటి వైద్యం చేస్తున్నారు అన్న దానిపై పట్టింపు లేదు. కొన్ని ఆసుపత్రులు కేవలం ఆర్ఎంపిలపై మాత్రమే ఆధారపడి పనిచేస్తున్నాయి. ఆసుపత్రులకు రోగులను తీసుకు వస్తే 40 శాతం వరకు కమిషన్ ఇవ్వడంతో పాటు కొన్ని ఆసుపత్రులు ఆర్ఎంపిలకు రాచమర్యాదలు చేస్తున్నారు. రూములు, మధ్యాహ్న భోజన టోకెన్లు ఇలా వారు ఏది అడిగితే అది ఏర్పాటు చేస్తుండడంతో పాటు ఇటీవల ఓ ఆసుపత్రి ఆర్ఎంపిలకు ఒక బోనాంజ ప్రకటించింది. మొదటి రెండు కేసులకు సంబంధించి బిల్లులు మొత్తం ఆర్ఎంపిల ఖాతాలో జమ చేసేవిధంగా ప్రచారం చేస్తుంది. దీనితో ఇన్ని సంవత్సరాలుగా ఊపు అందుకోని ఆ ఆసుపత్రి ఈ బోనాంజతో కాస్త రోగులు పెరిగాయని ఖమ్మంలో చర్చ సాగుతుంది. ప్రభుత్వం ప్రైవేటు వైద్య రంగం గురించి అందులో జరుగుతున్న దోపిడీ గురించి పట్టించుకోవడం లేదు. అవసరం లేని వైద్యాన్ని అందిస్తున్నా అడిగిన నాధుడు లేడు. అన్నింటికి మించి ఖమ్మం ఆసుపత్రులకు వైద్య సాయం కోసం వచ్చే రోగులకు కొన్ని ఆసుపత్రులు తీరని శాపాన్ని మిగులుస్తున్నాయి. రేడియాలజిస్టులు సహా కొన్ని ల్యాబులతో లింకులు ఏర్పాటు చేసుకుని అవసరం లేకున్నా వైద్యులే తాము వైద్యం చేసేందుకు అనుకూలంగా రేడియాలజిస్టులు ల్యాబ్ టెక్నీషియన్ల ద్వారా రిపోర్టులు తెప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.ఇటీవల ఓ యువకునికి అపెండిక్స్ (24గంటల కడుపునొప్పి), ఓవరిన్ సిస్ట్ ల విషయంలోనూ పరిమాణానికి మించిఉన్నాయని చెప్పి శస్త్ర చికిత్స చేసేందుకు రిపోర్టులు తెప్పించుకుంటున్నారని విమర్శలు వినవస్తున్నాయి. ఖమ్మం జిల్లా వైద్య రంగం రాష్ట్రంలోనే అత్యున్నతమైందిగా పేరొందడంతో తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇక్కడ వైద్యం కోసం వస్తున్నారు. రోగుల రాకతో ఆసుపత్రుల సంఖ్య అనుమతులు ఉన్నవి, లేనివి కలుపుకుని సుమారు 400కు చేరుకున్నాయి. ప్రభుత్వం ఎంత నియంత్రణ విధించినా, పలుమార్లు వివిధ రూపాల్లో హెచ్చరించినా ఖమ్మం నగరంలో గర్భ విచ్ఛిత్తి ఆపరేషన్లు చేయడం కూడా ఆగడం లేదు. రూ. 50వేల నుంచి రూ.60వేలు వసూలుచేసి యథేచ్ఛగా గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి వైద్య దోపిడీని అరికట్టకపోతే ఖమ్మం వైద్య రంగం అబాసుపాలు కాక తప్పదు.

# చౌక దుకాణాల్లో నో రైస్..!

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లాలో పలు చౌక దుకాణాల్లో బియ్యం అందుబాటులో లేవు. ముఖ్యంగా ఖమ్మం నగరంలోని బురహాన్‌పురం ప్రాంత చౌక దుకాణాల్లో పిడిఎస్ బియ్యం అందుబాటులో లేకపోవడంతో గత పది రోజులుగా లబ్ధిదారులు చౌక దుకాణాల చుట్టూ తిరుగున్నామని, చౌక దుకాణం వద్ద ఉదయం 6 గంటల నుంచే క్యూలో నిల్చున్నా బియ్యం అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చౌక దుకాణాల వద్ద వేచి చూసినా బియ్యం రాకపోవడంతో ఎనిమిది గంటల ప్రాంతంలో లబ్ధిదారులు నిరాశతో వెను తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు సంబంధించి మూడు నెలల కోటాను ఈనెలలో అందించే ఏర్పాటు చేసింది. కానీ చౌక దుకాణాలకు సరిపడ బియ్యం రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఖమ్మంనగరంలోని బురహాన్‌పురం ప్రాంతంలో ఉన్న చౌక దుకాణాలకు తక్షణమే బియ్యం సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# జర చూడండి సారూ..

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాలో 16,409 ఇండ్లు పేదలకు మంజూరయ్యాయి. వీటిలో 1,230 ఇండ్లు ఇంత వరకు ప్రారంభం కాలేదు. మరో 571 ఇండ్లకు మార్కింగ్ చేశారు. పునాదుల స్థాయిలోనే 1,098 ఇండ్లు ఆగిపోగా గోడల దశలో 594 ఇండ్లు శ్లాబ్ లెవల్‌కు వచ్చి 2,356 ఇండ్లు ఉన్నాయి. 10,560 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. నిర్మాణం పూర్తయిన ఇండ్లకు సంబంధించి చివరి బిల్లు ఒక్కో ఇంటికి రూ.1.40 లక్షలు రావాల్సి ఉంది. లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా బిల్లులు మంజూరు కావడం లేదు. తొలి దశలో ఇండ్లు మంజూరైన వారిలో 90 శాతానికి పైగా లబ్ధిదారులు ఇండ్లు పూర్తి చేసుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. వడ్డీకి ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి ఇండ్లు పూర్తి చేశామని నెలలు గడిచినా బిల్లులు రాకపోవడంతో వడ్డీకి ఇచ్చిన వారు ఒత్తిడి తెస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని లబ్ధిదారులకు చివరి బిల్లు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతుంది. రఘునాథపాలెం మండలంలో 700 ఇండ్లు పూర్తి కాగా ఒక్క లబ్ధిదారునికి కూడా చివరి బిల్లు మంజూరు కాలేదు. కొణిజర్ల మండలంలో 387 ఇండ్లు పూర్తి కాగా ఒక ఇంటికి కూడా చివరి బిల్లు చెల్లించలేదు. గుండాల మండలంలో 36 ఇండ్లు పూర్తి కాగా బిల్లులు రాలేదు. ఏదులాపురం మున్సిపాలిటీలో 354 ఇండ్లు పూర్తి కాగా బిల్లులు రాలేదు. ముల్కలపల్లి మండలంలో 205 ఇండ్లు పూర్తి కాగా బిల్లులు రాలేదు. కల్లూరు మండలంలో 530 ఇండ్లు పూర్తి కాగా ఆరు నెలలుగా బిల్లులు రాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా మధిర మండలంలో 380 మంది లబ్ధిదారులు, వేంసూరు మండలంలో 460 మంది, కామేపల్లి మండలంలో 282 మంది, సత్తుపల్లిలో 96 మంది పేదలు ఇందిరమ్మ ఇండ్ల చివరి బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు. చుంచుపల్లి మండలంలో 154, నేలకొండపల్లి మండలంలో 585 మంది లబ్ధిదారులు, ముదిగొండ మండలంలో 450 మంది చివరి బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు. వీలైనంత త్వరగా బిల్లులు మంజూరు చేయాలని, గృహప్రవేశాలు జరిగి నెలలు గడిచినా బిల్లులు రాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.ఇదిలా ఉండగా ఇప్పుడు ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం పేదలను గుర్తించి విడతల వారీగా ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎల్3లో ఉన్న వారికి సైతం ఇండ్లు మంజూరు చేస్తున్నారు. స్థానిక నాయకులు బంధువులు, అనుచరులకు ఇండ్లు మంజూరు చేసే విషయంలో ఒత్తిడి తీసుకు రావడం జరుగుతుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయమై ఆలోచన చేసి అర్హులైన పేదలకు రెండవ విడతలోనైనా ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

# అంతా ఎక్సైజ్ కనుసన్నల్లోనేనా..?

(మొదటిపేజీ తరువాయి)



పలువురు పేర్కొంటున్నారు. దీంతో కూలీలు, కార్మికులు, పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని అంటున్నారు. వైన్ షాపుల నిర్వాహకుల కనుసన్నల్లోనే ఈ విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**అధికారులకు తెలిసే జరుగుతుందా..?**

బెల్ట్ షాపులపై పలుమార్లు సమాచారం ఇచ్చినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అధికారులు తనిఖీలకు వచ్చే సమాచారం ముందుగానే వైన్ షాపుల నిర్వాహకులకు చేరుతుందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారికంగా ధృవీకరణ లేదు. ఎక్సైజ్ శాఖలో కొందరు అధికారులు మద్యం వ్యాపారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణకు సంబంధించి మామూళ్ల వ్యవహారం నడుస్తుందన్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**కుటుంబాలపై ప్రభావం...**

మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. మద్యం నియంత్రణ కోరుతూ గతంలో వైరాలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కూడా ఆందోళనలు జరిగినట్లు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లాడ మండలంలో బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి అనధికారిక మద్యం విక్రయాలు, అధిక ధరల వసూళ్లు, నిర్ణీత సమయం దాటిన తర్వాత జరిగే అమ్మకాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులపై వస్తున్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పారిశుద్ధ్యానికి ఊతం.. వైరా మున్సిపాలిటీకి కొత్త వాహనాలు..!



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కొత్త వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలో చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను మెరుగుపరిచే లక్ష్యంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.50లక్షల వ్యయంతో ఒక ట్రాక్టర్, నాలుగు చెత్త తరలింపు వ్యాన్‌లను కొనుగోలు చేశారు. ఈ కొత్త వాహనాలు తాజాగా వైరా మున్సిపాలిటీకి చేరుకున్నాయి. ఇప్పటివరకు ఉన్న వాహనాలతో చెత్త తరలింపులో ఎదురవుతున్న ఇబ్బందులకు కొత్త వాహనాల రాకతో కొంతమేర పరిష్కారం లభించనుంది. పట్టణంలోని అన్ని వార్డుల్లో చెత్త సేకరణను క్రమబద్ధీకరించి, ఎప్పటికప్పుడు డంపింగ్ ప్రాంతాలకు తరలించేందుకు వీటిని వినియోగించనున్నారు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడి పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించే అవకాశం ఏర్పడింది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి చెత్త సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. కొత్త వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ప్రతి వార్డులో చెత్త సేకరణ, తరలింపు పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ను యథావిధిగా కొనసాగించాలి

**పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై సండ్ర ఆగ్రహం**



ప్రజాపక్షం/సత్తుపల్లి: తెలంగాణలో పేద కుటుంబాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. పథకం నిలిచిపోయే పరిస్థితికి ప్రభుత్వం కారణమవుతోందని ఆయన ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రైతు బీమా తదితర వాటిపై అధికార పార్టీ చవితి ప్రేమను చూపుతుందని ఆరోపిస్తూ టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి రింగ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు. అయితే అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ సమయంలో వరంగల్ జిల్లా గిరిజన గ్రామాల పర్యటన సందర్భంగా ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ఇల్లు దగ్ధమై, కుమార్తె వివాహం కోసం దాచుకున్న డబ్బు అగ్నికి ఆహుతైన ఘటనతో చలించిన కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని సండ్ర గుర్తుచేశారు. తొలుత రూ.50 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకం అనంతరం రూ.75 వేలకు, ఆ తర్వాత రూ.లక్షకు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపు రెడ్డి హరికృష్ణా రెడ్డి, వీరపనేని బాబి, దొడ్డా శంకర్ రావు, అయాబ్ పాషా, అజార్, గుంజి వెంకటేశ్వరరావు ,మల్లూరి అంకమరాజు, పెనుబల్లి, వేం సూరు, సత్తుపల్లి మండలాల టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలపై ఆరోపణలు అర్థరహితం

**-మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల**
**-రఘునాథపాలెం మండల కాంగ్రెస్ కమిటీ**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అభివృద్ధి ప్రధాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన ఆరోపణలు అర్ధ రహితమని రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎటువంటి మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని తెలిపారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ఇటీవల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన ఆరోపణలు అర్థ రహితమన్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 42 ఏళ్ల రాజకీయ చరిత్రలో 22 ఏళ్లు మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు పనిచేశారన్నారు. తాను ఏ నియోజక వర్గంలో ప్రాతినిధ్యం వహించినా ఉమ్మడి ఖమ్మంజిల్లా అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలువైపులా ఏ గ్రామానికి వెళ్లినా తుమ్మల నాగేశ్వరరావు చేసిన అభివృద్ధి కనపడుతుందన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం,పాఠశాలలు ఏర్పాటు చేసిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుదేనన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్న అపర భగీరథుడు మంత్రి తుమ్మల అన్నారు. ఖమ్మం అర్బన్ మండల పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతమైన రఘునాథపాలెంను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసిన ఘనత మంత్రి తుమ్మలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ. 500 కోట్లతో మండలాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధితో పాటు ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు. మండలంలో సాగునీటి ఇబ్బందులను గుర్తించి మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్ నీటిని రఘునాథపాలెం చెరువులకు నింపి సస్యశ్యామలం చేశారన్నారు. బుగ్గవాగు ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు.స్వామి నారాయణ పాఠశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వంటి పాఠశాలలను మండలంలో ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అటువంటి నాయకునిపై విమర్శలు చేయడం తగదన్నారు. రాజకీయాల్లో సద్ విమర్శలు ఉండాలి కానీ వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా చేసిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని తెలిపారు. మరల రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేలోత్ దేవ్ సింగ్, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, కొంటెముక్కుల నాగేశ్వరరావు, లాల్‌సింగ్, దరావత్ రామ్మూర్తి, బానోత్ కోటేష్‌నాయక్, కిలారు వెంకటరమణ, బి. లక్ష్మణ్ గౌడ్, బండి వెంకన్న, చిన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**-సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమనత్వం, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం సాగించారన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డా॥ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. జానయ్య, నాయకులు నూతి సత్యనారాయణ గౌడ్, అమరగాని వెంకన్న గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్, పోలంపల్లి నాగరాజు గౌడ్, బండి నాగేశ్వరరావు గౌడ్, గజ్జెల్లి వెంకన్న, బిచ్చాల తిరుమలరావు గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపర్తి**




**ప్రజాపక్షం/చింతకాని :** అభ్యుదయ ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న కొదుమూరు గ్రామంలో ఈనెల21న నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జిల్లా 25 వ మహాసభలు, యువజన మహా ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ భాధ్యులు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు తెలిపారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరవుతారన్నారు. కొదుమూరు జ్యోతి ఫంక్షన్ హాల్ లో మహాసభ ఏర్పాట్లను ఏఐవైఎఫ్ జిల్లా నాయకత్వం, ఆహ్వాన సంఘం బుధవారం పరిశీలాంచింది.అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అబ్బూరి మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీల అమలు, గత కార్యక్రమాలపై సమీక్షతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణను రూపొందించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఏర్పాట్లన్ని ఆహ్వాన సంఘం పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి చింతల రమేష్, మండల కార్యదర్శి బోళ్ళ భాను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో డిప్యూటీ కమిషనర్ విద్యాలత పర్యటన



**ప్రజాపక్షం/ముదిగొండ:** పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యాలత మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు కందుల దేవేంద్రం పొలంలో చేపడుతున్న ఫార్మ్‌పాండ్ పనులను పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె, గ్రామ సెక్రటరీ జి.స్రవంతిని, సర్పంచి కందుల బాలచందర్‌లను గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పింఛన్‌ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పంచాయతీ పరిపాలన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, జిల్లా పంచాయతీ అధికారి వినోద్, డీఎల్‌పీఓ విజయలక్ష్మి, డిప్యూటీ సీఈఓ పి.శ్రీనివాస్, ఇంఛార్జి ఎంపీఓ రామకృష్ణ, ఏపీఓ రంగనాయకమ్మ, జిల్లా స్థాయి అధికారులు, టీఏలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన బస్టాండ్ తనిఖీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నూతన బస్టాండ్‌ను టిజిఎస్ ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఈడి)సోలోమాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఈడి సోలోమాన్ ఖమ్మం నూతన బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని కాన్పరెన్స్ హాల్‌లో డా॥ గిరి నర్సింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈడి సోలోమాన్ స్వయంగా రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. ఆపదలో ఉన్న తోటి వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 20 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు సహకారమందించాలి

**-స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ను స్తంభాద్రి ఉత్సవ సమితి కోరింది. మంగళవారం స్తంభాద్రి ఉత్సవ సమితి (ఖమ్మం నగరంలోని శ్రీ గణేష్ మండప నిర్వాహకుల ఐక్య వేదిక) బాధ్యులు కలెక్టర్ దివాకర టిఎస్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను స్తంభాద్రి ఉత్సవ సమితి బాధ్యులు శాలువతో సత్కరించి పూలమొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వినోద్ లాహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటెల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కీసర జైపాల్‌రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్నకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, కోశాధికారి మూలగుండ్ల శ్రీహరి పాల్గొన్నారు.

# నూతన పైప్‌లైన్‌కు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మధిరః** కృష్ణాపురం గ్రామంలో ప్రజల మంచినీటి ఇబ్బందులను గుర్తించి గ్రామ ప్రజలకు గ్రామపంచాయతీ కార్యాలయం నుండి ఎస్టీ కాలనీ ఓవర్ ట్యాంక్ వరకు రూ.9లక్షల ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రేస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, ఏఎంసి డైరెక్టర్ వేల్పుల చెంచయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్‌రావులు తెలియజేశారు. అనంతరం గ్రామ ప్రజల మంచినీటి ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేసినందుకు గ్రామ ప్రజల తరపున నాయకుడు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళా సమైక్య భవనం స్లాబ్ పనులు



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని కట్టకూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న మహిళా సమైక్య భవన స్లాబ్ వేసే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచి తోట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మహిళా సమైక్య భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామ మహిళ సమావేశాలు, శిక్షణ, స్వయం ఉపాధి తదితర కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కొత్తపల్లి పద్మ, నాగార్జున, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చ రామయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తిరుపతి, జిల్లా నాయకులు అజయ్, కోమినేని సుధాకర్, వార్డు సభ్యులు చెన్న ఉపేందర్‌రావు, కొత్తపల్లి రాము, రాగం వెంకటనారాయణ, దార రాందాస్, బాజా ఉపేందర్, ఏపీఎం నాగేశ్వరరావు, సీసీ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి నర్రా స్రవంతి, వీఓఏ రేగళ్ల అనిత, గ్రామ సమైక్య అధ్యక్షురాలు చెను ఉషారాణి, సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ముదిగొండ:** గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి వినోద్, డిప్యూటీ కమిషనర్ విద్యాలత, డీఎల్‌పీఓ విజయలక్ష్మి లకు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ..రెండో పీఆర్‌సీలో గ్రామ పంచాయతీ కార్మికులను గుర్తించి వేతనాలు పెంచాలని, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నం.51ను సవరించి ప్రతీ నెల వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు కార్మికులను అకారణంగా తొలగించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇరుకు వెంకటేశ్వర్లు, కార్యదర్శి హుస్సేన్, నాయకులు పల్లెపొంగు రవి, కృష్ణ, ఉపేందర్, నాగేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు నైపుణ్యాలపై దృష్టి సారించాలి

**-కలెక్టర్ దివాకర టీఎస్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కమ్యూనికేషన్, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కారం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు.మంగళవారం రేలకాయలపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల విద్యా ఫలితాలు, భోజనం, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆసక్తులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. లైబ్రరీ, సంగీత గది, కళా ప్రదర్శన శాల, శాస్త్ర ప్రయోగశాలలను పరిశీలించి విద్యార్థుల ఆవిష్కరణలను అభినందించారు. కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో రహదారి, ఆర్టీసీ బస్సు, ప్రహరీకి విద్యుత్ కంచె, అదనపు లైట్ల ఏర్పాటు వంటి సమస్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రత, పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, సర్పంచ్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి మంత్రి పర్యటనను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలో జరిగే పర్యటన ను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఒక ప్రకటన ను విడుదల చేశారు. మండలం లోని చెరువుమాధారం లో సోలార్ వినియోగం పై అవగాహన సదస్సు ను నిర్వహిస్తారని పేర్కొన్నారు. బుద్దారం, కొంగర గ్రామంలో పీఆర్ రోడ్డు నిర్మాణం కు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. నేలకొండపల్లిలో ఇటీవల మరణించిన పలు కుటుంబాలను పరామర్శిస్తారని పేర్కొన్నారు. బోదులబండ లో వివాహ వేడుకలలో, చెన్నారం లో గృహ ప్రవేశం వేడుకలలో పాల్గొంటారని తెలిపారు. సుర్దేపల్లి, ఆచార్లగూడెం పలువురు ను పరామర్శించనున్నట్లు తెలిపారు. కావునా పర్యటన ను జయప్రదం చేయాలని కోరారు.

## దేవాలయ భూముల ఆక్రమణపై విచారణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని రాజేశ్వరపురం లోని దేవాలయం భూములను ఆక్రమణ పై మంగళవారం దేవాదాయ శాఖాధికారి విచారణ నిర్వహించారు. ప్రజావాణి లో ఫిర్యాదు మేరకు స్పందించిన దేవాదాయ శాఖ కార్యనిర్వహాకాధికారి కె.శ్రీకాంత్ విచారణ చేపట్టారు. మంగళవారం గ్రామంలో దేవాలయంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పంచాయతీ పాలకవర్గ సభ్యులను, గ్రామ పెద్దలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీ రాజగోపాలస్వామి, మరియు శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయం కు చెందిన మొత్తం 42.18 ఎకరాలు భూమి ఉంది. దీనిని పలువురు ఆక్రమించుకున్నారని స్థానికులు ఆరోపించారు. చాలా కాలం నుంచి ఆ భూములకు వేలం పాట నిర్వహించటం లేదని తెలిపారు. అదే విధంగా అసలు దేవాలయం కు చెందిన భూములు ఎంత వరకు ఉన్నాయో హద్దులు లేకుండా చేశారని పేర్కోన్నారు. కౌలు రైతులను కౌలు ఎంత చెల్లిస్తున్నారు. ఎవరికి ఇస్తున్నారు, అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాలయ భూములను పరిశీలించారు. వెంటనే దేవాలయం భూముల హద్దుల ను నిర్ణయించేందుకు సర్వే చేయించాలని తహశీల్దార్ కు కోరనున్నట్లు తెలిపారు. సమగ్ర విచారణ ను దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక ను అందించనున్నట్లు ఈవో పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండా రంగయ్య, ఎన్.మల్లయ్య, అడపాల రమేష్, రాసాల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నీనో ప్రభావంపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/జూలూరుపాడు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు రైతు వేదికనందు రైతులకు ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఎల్ నినో అనేది మధ్య, తూర్పు భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రత సాధారణం కంటే అధికంగా పెరగడం వల్ల ఏర్పడే సహజ వాతావరణ విషయమని వివరించారు. దీని ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా గాలి ప్రవాహాలు, వర్షపాత విధానాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో పాటు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యంగా లేదా తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. అలాగే క్షేత్ర సందర్శనలో బాగంగా కొత్తూరు రైతు రామారావు పెసర పంటను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ బి సుధాకర్ రావు, మండల వ్యవసాయ అధికారి శ్రీ జి దీపక్ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

# మూడేళ్లయినా చేరని లక్ష్యం..!

- వంట గ్యాస్ ఈ కేవైసికి నెలాఖరు గడువు
- ఇంటి నుండి చేసుకోవడం సులువే
- మీ మొబైల్‌తో చేసుకోండి ఇలా
- అక్రమాలకు చెక్ పెట్టేందుకే




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వంట గ్యాస్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రవేశపెట్టిన ఈ కేవైసి మూడేళ్లయినా లక్ష్యాన్ని చేరుకోలేదు. దీంతో ప్రభుత్వం మరో అవకాశాన్ని ఇచ్చి ఈ నెలాఖరు వరకు గడువు పొడిగిస్తూ ఇదే ఆఖరి గడువుగా ప్రకటించింది. వంట గ్యాస్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం 2023లో ఈ కైవేసి విధానాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి వరకు కూడా చాలా మంది ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. దీంతో పౌరసరఫరాల శాఖ గ్యాస్ ఏజెన్సీలకు మందలించి ఈ కేవైసి చేసుకూనే అవకాశాన్ని పొడిగించింది. ఇదిలా ఉండగా ఏజెన్సీలు ఇంటి వద్దనే ఫోన్‌లో యాప్ ద్వారా ఈ కేవైసీ చేసుకునే వెసులుబాటు కల్పించాయి. గ్యాస్ కనెక్షన్ నెంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడంతో పాటు ముఖ గుర్తింపు వేలి ముద్రలు, ఐరీష్ వంటి మూడు విధానాలతో ఎల్పి వినియోగదారులకు ఈ కేవైసి పూర్తి చేసుకోవచ్చు.

**మొబైల్‌లో చేసుకోండి ఇలా...**

హెచ్‌పి భారత్ ఇండిన్ ఎల్పి గ్యాస్ ఏజెన్సీలు సేవలు అందిస్తున్నాయి. ఈ కైవేసి చేసుకునేందుకు మొబైల్ నుండి ప్లే స్టోర్ కి వెళ్లి ఎల్‌పిజి కంపనీ పేరుతో యాప్ డౌన్ లోడు చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసి లింక్ అయిన ఫోన్ నెంబర్ లేదా ఈ మెయిల్‌తో పాస్‌వర్డ్ క్రియేట్ చేసి లాగిన్ అవ్వాలి. మొదటిసారిగా ఉపయోగిస్తే సైన్ ఆఫ్ పై క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. చూపించిన మెనూలో 16 అంకెల ఎల్‌పిజి ఐడిని లింక్ చేయాలి. అప్పుడు కస్టమర్ వివరాలు కనిపిస్తాయి. లాగిన్ అయ్యాక హోమ్ పేజీలో ప్రైఫైల్ క్లిక్ చేస్తే ఆధార్ లింక్‌డ్ అండ్ ఈ కైవేసి స్టేటస్ కనిపిస్తుంది. అక్కడ గ్రీన్ కలర్ బాక్స్‌లో రెడ్ మార్కు ఉంటే మీ కేవైసి పూర్తయినట్లు. కాకపోతే అక్కడే రీ అథంటికేషన్ బటన్ నొక్కి మీ ముఖాన్ని స్కాన్ చేసి బయో మెట్రిక్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ఒక వేళ మీ ఆధార్ బయోమెట్రిక్ లాక్ అయి ఉంటే మొదటిగా దాన్ని అన్‌లాక్ చేయాలి. ఇలా చేయడం ద్వారా ఈ కేవైసి మొబైల్‌లోనే చేసుకోవచ్చు. లేదంటే ఈ కైవైసి కోసం నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. కెవైసి పూర్తి చేసుకోక పోతే సబ్సిడి డబ్బులు ఇక నుండి బ్యాంకు ఖాతాలో జమకావు. ఇప్పటికైనా ఈ కేవైసి పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్, ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) వచ్చిన సందర్భంగా వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మంత్రి కి వివరిస్తూ, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని మూడు జోన్లుగా కార్పొరేషన్లు మున్సిపాలిటీ గ్రామీణ ప్రాంతం, అన్ స్కిల్డ్ సెమి స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్, జీతాలు పెంచినమని, జీవో నెంబర్ 6, తెచ్చారు. దీని ద్వారా మున్సిపాలిటీలో ఎంతో కాలం నుండి పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు,వర్క్ ఇన్స్పెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, వేతనాలు 5,000 నుండి 1,000 రూపాయల వరకు తగ్గించారు. దీనితో కార్మికులు బతకలేని స్థితి ఏర్పడ్డది, వెంటనే ముఖ్యమంత్రి తో మాట్లాడి పాత జీవోను అమలు చేసే విధంగా చూడాలని కోరారు. సింగరేణిలో 9 సంవత్సరాల నుండి, కాంట్రాక్టు కార్మికులకు ఫిబ్రవరి 12న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాసవరణలకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తే, సింగరేణిలో మాత్రం కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ వేశారు. ఇది అనైతికం నో వర్క్ నో పే పరిగణించి, సర్కులర్ జారీ చేయాలి, ముఖ్యమంత్రి ఉప ముఖ్య మంత్రి బట్టి తో , సీ అండ్ ఎండి తో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి, ఇల్లందు ప్రభుత్వ వైద్య విధానా పరిషత్ లో 30 మంది కార్మికులు పనిచేస్తుండగా 11 మందికే జీతాలు వేయడం రెండు నెలలుగా జీతాలు పెండింగ్ ఉండడం, వలన కార్మికుల ఉద్యోగ భద్రత సమస్య జీతాల సమస్య వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించే విధంగా చూసి ఆ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

# గ్రామాల్లో దోమల మోత..!

-పారిశుధ్య చర్యలను మరిచిన గ్రామ పంచాయితీలు
-పట్టించుకోని అధికారులు








**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని పలు గ్రామ పంచాయితీల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దోమల బెడదతో ప్రజలు జ్వకాలు, ఇతర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ గ్రామ పంచాయితీల్లో ఆ చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పంచాయితీల్లో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయితీ పాలకవర్గాలు, కార్యదర్శులు కూడా పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ పాలకులు, కార్యదర్శులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించి వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వైరాలో సాగునీటి వార్..!

-రిజర్వాయర్ నీళ్ల చుట్టూ పార్టీల పోరు
కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ (ఎంఎల్ )మాస్‌లైన్ మధ్య వార్
-నీటి విడుదలకు ఆదేశాలు లేవంటున్న అధికారులు





**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుతం సుమారు 16.7 అడుగుల నీటి సామర్థ్యం ఉండగా, రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో దాదపాఉ 18వేల ఎకరాల్లో సాగు కొనసాగుతుంది. ఈ నేపద్యంలో సాగునీటి విడుదలపై వైరాలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్, సిపిఎం, ఎంఎల్ పార్టీ మాస్‌లైన్ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. రిజర్వాయర్ నుంచి నీటి విడుదల చేయవద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు అని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ రైతులు అవసరాలు దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేయాలని అఖిలపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదివారం అఖిలపక్ష పర్టీల సమావేశం జరిగిన అనంతరం అదే రోజు రాత్రి సుమారు 12గంటల సమయంలో రిజర్వాయర్ గేట్లను కొంతమేర ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో సోమవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఐబి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తారా? లేదా? అనే విషయంపై నీటిపారుదలశాఖ అధికారులు అధికారికంగా ప్రకట చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేయడం లేదంటే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రకటించాలని కోరారు. అయితే ప్రభుత్వం నుంచి అధికారికంగా నీటి విడుదలకు ఆదేశాలు లేవని అధికారులు చెబుతున్నప్పటికీ...అనధికారికంగా కొంత నీటిని విడుదల చేస్తున్నట్లు ఆందోళనకారులకు వివరించినట్లు తెలుస్తుంది. అనంతరం రిజర్వాయర్ నుంచి నీటి ప్రవాహాన్ని మరికొంత పెంచే విధంగా నీటిని విడుదల చేశారు.

**నీళ్లపై రాజకీయ మాటల యుద్ధం...**

సాగునీటి విడుదల వ్యవహారం ఇప్పుడు వైఆరలో రాజకీయ పోరుగా మారింది. అధికార కాంగ్రెస్ నేతలపై బిఆర్ఎస్, సిపిఎం, ఎంఎల్ పార్టీ మాస్‌లైన్ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శలు చేస్తూ, రైతులకు పూర్తిస్థాయిలో అఖిలపక్షం పట్టు బడుఉతన్నాయి. మరోవైపు రిజర్వాయర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అయితే నీటిపారుదలశాఖ అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి నీటి విడుదలకు అధికారిక ఆదేశాలు లేవని పదేపదే స్పష్టం చేస్తున్నట్లు నాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష రైతుల సమావేశంలోను నీటిపారుదలశాఖ ఈఈ నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో ఇప్పుడు నీటి విడుదల అంశం చుట్టూ అధికార పార్టీ, ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి.

**రైతుల ప్రయోజనమా...రాజకీయ ఆదిపత్యమా?**

వైరా రిజర్వాయర్ ఆయకట్టు క్రింద సుమారు 18వేల ఎకరాల్లో పంటలు సాగులో ఉండటంతో రైతులకు సాగునీరు అత్యంత కీలకంగా మారింది. అధికారులు నిబంధనల ప్రకారం నీటిని విడుదల చేయడం సాధ్యం కాదంటుండగా, రాజకీయ పార్టీలు మాత్రం రైతుల కోసం నీటిని విడుదల చేస్తున్నాయి. అధికారులు ఆదేశాలు లేవంటున్నారు. అయినా నీటిని విడుదల చేస్తున్నాం అని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటుండగా, రాజకీయ ప్రకటనలు కాదు..పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందించే అధికారిక ఉత్తర్వులు కావాలి అని మరో వర్గం డిమాండ్ చేస్తుంది. దీంతో వైరా రిజర్వాయర్ నీళ్లు ప్రస్తుతం కేవలం ఆయకట్టు పంటలకే కాకుండా రాజకీయ పార్టీల మధ్య ఆదిప్తయ పోరుకు కూడా కేంద్ర బిందువుగా మారాయి. రిజర్వాయర్ నీటి లభ్యత, ప్రభుత్వ ఆదేశాలు, రైతు అవసరాలు...ఈ మూడింటిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే నీటి రాజకీయం మరింత ముదిరే అవకాశం కనిపిస్తుంది.

## పెనగడప పీహెచ్‌సీ పరిధిలో దోమల మందు పిచికారీ

12 గ్రామాల్లో మొదటి విడత కార్యక్రమం ప్రారంభం




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం నడిఒడ్డు గ్రామంలో సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ మహమ్మద్ గోరిబాబు చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. ప్రతి ఇంటిలో లోపల, బయట తప్పనిసరిగా దోమల మందు పిచికారీ చేయించుకోవాలని కోరారు. దోమతెరలను వినియోగించడంతోపాటు ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెనగడప గ్రామపంచాయతీ, పెనగడప పీహెచ్‌సీ పరిధిలోని పెనగడప, శ్రీనగర్ కాలనీ, ఎబి నగర్, రాంపురం, నడిఒడ్డు, ములుగుగూడెం, చంద్రుకుంట, పాలవాగు, గడ్డిగుప్ప, జగ్గారం, మర్రిగూడెం, డబుల్ బెడ్‌రూమ్ మొత్తం 12 గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యుఓ పి.శ్రీనివాసరావు, హెచ్‌ఈఓ రవి, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్‌పూర్‌లో బీఎల్‌ఓలకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఓటు హక్కు నమోదు అధికారులు (బీఎల్‌ఓలు) పద్మ, ఈశ్వరి, శివలీల, మస్తాన్‌లను ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా బాధ్యతాయుతంగా పూర్తి చేసినందుకు ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌పూర్ సర్పంచ్ సపావత్ కళ్యాణి, ఉప సర్పంచ్ గంగారం, పంచాయతీ కార్యదర్శి షర్మిల బీఎల్‌ఓలను పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు నమోదు అధికారుల సేవలు అభినందనీయమని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు ప్రతి ఓటును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అర్హులైన పౌరుల ఓట్లు తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించి ఓటర్ల సవరణ ప్రక్రియను విజయవంతం చేశారని ప్రశంసించారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎర్ర ప్రియాంక, శిల్ప, కేత రాధ, ఇస్లావత్ కాంతమ్మ, సపావత్ సురేష్, గ్రామ పెద్ద సొప్పరి క్రాంతి, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** పంచాయితీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏన్కూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు గాంధీ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని, ఎన్నికల హామీ మేరకు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 51ను సవరించి బహుళ ప్రయోజన కార్మికుల విధానాన్ని రద్దు చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. పంచాయితీ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు మృతుల అంత్యక్రియలకు రూ 30వేలు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఇల్లూరి బిక్షమయ్య, మేడి రాములు, కిరణ్, పూర్ణకంటి కాటయ్య, గొడ్డ కాలయ్య, పూర్ణకంటి కోటి, తదితరులు పాల్గొన్నారు.

## ఏన్కూరు ఇన్‌చార్జి ఎంపీఓగా ఖాదర్ మియా



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు ఇన్‌చార్జి మండల పంచాయితీ అధికారి(ఎంపీఓ)గా షేక్ ఖాదర్ మియా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గంగుల నాచారం గ్రేడ్ 2 పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఎంపీఓగా పని చేసిన జీవీఎస్ నారాయణ ఎంపీడీవోగా వైరాకు పదోన్నతిపై వెళ్లారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఖాదర్‌మియా తెలిపారు.

## గ్రామ పంచాయితీ కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం/కారేపల్లి:** సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండలంలోని 41 గ్రామ పంచాయితీల కార్మికులు మంగళవారం సమ్మె చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద రిలే దీక్షలు నిర్వహించారు. జీతాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని, తొలగింపులు నిలిపివేయాలని, మృతుల కుటుంబాలకు అంత్యక్రియల కోసం రూ 30వేలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. హామీలు అమలు చేయకపోతే దీర్ఘకాలిక సమ్మె, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్, మండల కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి బాటలో తనయ మనీషా లక్ష్మీ

-వైరాలో బీఆర్ఎస్ బలోపేతానికి విస్తృత పర్యటనలు
-పెరుగుతున్న ప్రజాదరణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** దివంగత మాజీ ఎంఎల్‌ఏ బానోత్ మదన్‌లాల్ నాయక్ అడుగుజాడల్లో ఆయన తనయ మనీషా లక్ష్మీ రాజకీయంగా ముందుకు సాగుతున్నారు. తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ వైరా నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను కలుస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ పేదలు, మహిళలు, రైతులు, యువత, పార్టీ కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటూ అవసరమైన సందర్భాల్లో తనవంతు సహకారం అందిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు. తండ్రి ప్రజాసేవను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. మనీషా లక్ష్మీ పర్యటనలకు మదన్‌లాల్ అభిమానులు, పాత కార్యకర్తల నుంచి స్పందన లభిస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. పార్టీ అధిష్టానం అప్పగించే బాధ్యత కోసం ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం. తాజా పర్యటనల నేపథ్యంలో వైరా బీఆర్ఎస్ రాజకీయాల్లో మనీషా లక్ష్మీ భవిష్యత్ ప్రస్థానంపై ఆసక్తి నెలకొంది.

## 30 కుటుంబాలకు సాయం





**ప్రజాపక్షం/అశ్వాపురం:** మారుమూల గిరిజన ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు లిటిల్ కాజ్ సొసైటీ ఆధ్వర్యంలో మొండికుంట చింతకుంట గ్రామంలో 30 కుటుంబాలకు సహాయ సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కమటం నరేష్ సామగ్రిని అందజేశారు. సొసైటీ డైరెక్టర్ నిదానపల్లి ప్రసాద్, కోఆర్డినేటర్ పాడిగ నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాల అవసరాలను గుర్తించి విద్య, వైద్యం, మహిళా సాధికారత, ఆహారం, వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, సొసైటీ సభ్యులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 17వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

## ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లైమెంట్



**ప్రజాపక్షం/కల్లూరు:** ఈనెల 23, 24 తేదీలలో సత్తుపల్లి లో జరిగే ఏఐటియుసి 17వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం నగర కార్పొరేటర్ బి. జి. క్లైమెంట్ కార్మికులను కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తో కలిసి కల్లూరు మండలంలో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. కల్లూరు మండలం లోని మున్సిపల్, వివో ఏ, రిసోర్స్ పర్సన్స్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సత్తుపల్లి ప్రాంతంలో తొలిసారి ఏఐటీయూసీ జిల్లా మహాసభలు జరగనున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ఈ ప్రాంత కార్మిక వర్గం పై ఉందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకువచ్చిన లేబర్ కోడ్ల కారణంగా కార్మికుల జీవితాలలో దుబెక్షం వచ్చే పరిస్థితి ఉందన్నారు. గత 100 సంవత్సరాల్లో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ కాల రాస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గురించి, దయతలిచొ, సంక్షేమం కోసమో చట్టాలు చేయలేదని కేవలం కార్మికుల పోరాట ఫలితంగా మాత్రమే ఆ చట్టాలు హక్కు చట్టాలుగా లభించాయన్న విషయాన్ని కార్మికులు మరవకూడదు అన్న యూనియన్ పెట్టుకునే అధికారం, సమస్యలపై మాట్లాడే హక్కు , కనీస వేతనాలు, పారిశ్రామిక ప్రాంతాలలో కల్పించవలసిన వసతులు, పని ప్రదేశాలలో కార్మికులకు ఉండే సంక్షేమం తదితర అంశాలపై లేబర్ కోడులు ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ప్రత్యక్షంగా ఉపాధిని కోల్పోయే పరిస్థితి కొన్ని అయితే సంక్షేమం, హక్కులు అడగకూడదని నిర్బంధించేయున్నాయన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తమ జాబితాలో మున్సిపాలిటీలను వేసుకోవడం కొరకు కల్లూరు మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చారని, నేడు కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని 9 నెలలు గడుస్తున్న జీతాలు చెల్లించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీలో లోపు జీతాలు చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సయ్యద్ వజీర్ మియా, చిన్న, మణిరాజ్, బాబు గౌడ్, సుధాకర్ అంజలి, యశోద, వివో ఏల సంఘం నాయకురాలు వేము నాగమణి, కోనూరు నీలవేణి ఆర్పీ సంఘం నాయకులు జొన్నలగడ్డ కుమారి, ఉబ్బన రమాదేవి మధ్యాహ్న భోజనం వర్కర్ సీనియర్ నాయకులు ఖమ్మంపాటి వెంకటలక్ష్మి బాగా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# లే అవుట్లు భవన నిర్మాణాల అనుమతులు పంచాయతీలదే..



**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే లేఅవుట్లు భవన నిర్మాణాల అనుమతులు పంచాయతీ లే మంజూరు చేయాలని నిబంధనలను పరిశీలించి అనుమతులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి పెనుబల్లి మండల ప్రత్యేక అధికారి వినోద్ అన్నారు. మంగళవారం పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు సంపద సృష్టించేందుకు పంచాయతీ పాలకులు ఉద్యోగులు దృష్టి సారించాలని అన్నారు. మండలంలో రైతులు పొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గత సర్పంచుల కాలంలో పెండింగ్ లో ఉన్న నిధుల చెల్లింపులను నిబంధనల ప్రకారం చెల్లించాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఈ సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన జరుగుతున్న కార్యక్రమాల పైన నివేదికలను సర్పంచులకు, కార్యదర్శులకు వినిపించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వీరభద్ర నాయక్, ఎంపీడీవో వీర స్వామి, ఎంఈఓ మోహన్ రావు, బానోతు పాప, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి అస్వస్థత

## 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/వైరా:** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ బైపిసి చదువుతున్న ధరావత్ అఖిల తరగతి గదిలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వైద్యులు విద్యార్థినిని పరీక్షించి అనారోగ్య కారణంగానే అస్వస్థకు గురైందని, ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుగానే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు కళాశాలకు రాకుండా ఇంటి వద్దే విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

# రూ.62కోట్లు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా నిధులు మంజూరు



**ప్రజాపక్షం/మధిర:** మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తన సొంత నియోజకవర్గమైన మధిరను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.62 కోట్ల భారీ నిధుల ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పురపాలక శాఖ కమీషనర్ కార్యాలయం నుండి వేగంగా ప్రక్రియ ప్రారంభమైంది. మధిర మున్సిపాలిటీ వార్డులో మెటల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.17కోట్లు, మధిర మున్సిపాలిటీ వార్డుల్లో సిసి రోడ్ల నిర్మాణం కోసం రూ.40కోట్లు, అలాగే సిసి డ్రైన్‌లు, ఆర్‌సిసి కల్వర్టులు, వైకుంఠదామం అభివృద్ధి కోసం మరొక రూ.5కోట్లు, ఇలా మొత్తం రూ.62 కోట్లు పనులపై వెంటనే సమగ్ర నివేదికలు పంపాలని జాయింట్ డైరెక్టర్ కె.ఫల్గుణ్ కుమార్, మధిర మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో నిధుల ప్రక్రియ ఊపందుకోవడంతో, మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత నేతృత్వంలో అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వార్డులో తక్షణమే నిర్మించాల్సిన సిసి రోడ్లు, డ్రైనేజీల స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులను గుర్తించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ మధిర పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.62కోట్ల భారీ నిధుల ప్రతిపాదనలకు చొరవ చూపిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల నివేదికల ప్రక్రియ పూర్తికాగానే పనులను సత్వరమే ప్రారంభించి మధిరను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శామ్యూల్‌పాల్, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, డవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా, నానో డిఏపిపై క్షేత్ర ప్రదర్శన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య రైతులకు నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బస్తాల రూపంలో యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియా, నానో డిఏపిని వినియోగించాలని సూచించారు. నానో యూరియాను ఆకులపై పిచికారి చేయడం ద్వారా మొక్కలకు నత్రజని నేరుగా అందుతుందని, తద్వారా యూరియా వినియోగాన్ని 50% వరకు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపారు. నానో ఎరువుల వినియోగంతో ఎరువుల ఖర్చు తగ్గించుకోవడంతో పాటు పంటలకు సమతుల్య పోషకాలు అందించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి వెంపటి కీర్తి, ఇఫ్కో ఫీల్డ్ ఆఫీసర్ నాగార్జున, ఎండివో మహిందర్‌రెడ్డి, రైతుఉల సైదులు, నగేష్, గోపి పాల్గొన్నారు.

# సేవలు, ఆదాయ వృద్ధిపై దృష్టి సారించాలి : ఈడి సోలోమన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రయాణికులకు నాణ్యమైన సేవలు, ఆదాయ వృద్ధిపై డిపో మేనేజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని టిజిఎస్ ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సోలోమన్ తెలిపారు. ఖమ్మం రీజియన్ పర్యటనలో భాగంగా మంగళవారం ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో ఖమ్మం పాత బస్టాండ్ లోని రీజినల్ కార్యాలయంలో ఈడి సోలోమన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రీజియన్‌లోని డిపోల పనితీరు, ప్రయాణికులకు అందుతున్న సేవలు, బస్సుల నిర్వహణ, ఆదాయ వృద్ధి, కొత్త రూట్ల అవకాశాలు తదితర అంశాలపై డిపోల వారీగా ఈడి సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన, సురక్షితమైన రవాణా సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. బస్సుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేసి సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరి చేయాలన్నారు. బస్సుల పరిశుభ్రత, ఫిట్‌నెస్, సమయ పాలన పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీరు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డిపో మేనేజర్లు మరింత అంకిత భావంతో పనిచేసి డిపోల అభివృద్ధికి కృషి చేయాలని ఈడి సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించడంతో పాటు ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేయాలన్నారు. సమిష్టి కృషితో ఖమ్మం రీజియన్ ఆదాయాన్ని వృద్ధి చేయడంతో పాటు ప్రయాణికుల సేవలు, నిర్వహణ పరంగా మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

# పెద్ద కోరుకొండి పంచాయతీ భవనం ప్రారంభం ఎన్నడో?



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి నూతన పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదని పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయి రెండు నెలలు గడిచిన ప్రారంభానికి ప్రజాప్రతినిధులు, అధికారులు దానిపై దృష్టి పెట్టడం లేదని దీనివలన గ్రామపంచాయతీ నిర్వహణ ఊరికి దూరంలో ఉన్న రైతు వేదికలో విధులు నిర్వహణ కష్టంగా ఉందని, ప్రజలు కిలోమీటర్ మేరా నడిచి వెళ్ళి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిధంగా నూతన అంగన్వాడీ భవనం పాఠశాల ఆవరణలో నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పంచాయతీ భవనం అంగన్వాడీ భవనం లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పెద్ద కోరుకొండి గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ అధికారి రాజాను, ఎంపీవో ఏనుగు సురేష్ బాబు ను వివరణ కోరగా ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు.

# మామూళ్ల మత్తులో ప్రభుత్వ కార్యాలయాలు : మహ్మద్ సలాం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు డబ్బులు ఇవ్వనిదే జరగడం లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం ఆరోపించారు. చిన్న చిన్న ధృవపత్రాల కోసం కూడా ప్రజలను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని డబ్బులు ఇచ్చే వారికి ఒక రకంగా ఇవ్వని వారికి మరో రకంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహంవ్యక్తం చేశారు. టూటౌన్ ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన సిపిఐ సమావేశంలో సలాం మాట్లాడుతూ కులం, స్థానికత, తదితర ధృవపత్రాల కోసం వెయ్యి రూపాయల నుంచి రెండువేలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, పేదలు అనే తేడాలేకుండా ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం దారుణమన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ మామూళ్ల లేకుండా పనులు జరగడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార యంత్రాంగం తమ తీరు మార్చుకోకపోతే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని సలాం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, కుమార్, పేరబోయిన మోహన్‌రావు, దుర్గానాథ్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ తల్లాడ :** సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు దర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా నాగేశ్వరరావు, సత్తేనపల్లి నరేష్, చాంద్‌పాషా, వేలాద్రి, బాబు, ఎల్లారావు, ప్రసన్నకుమార్, శంకర్ సుజాత, లక్ష్మి , సురేందర్ రెడ్డి, సునీత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు అభినందనీయం

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వ ఐటీఐఅడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు మరియు భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి, ముందుగా విద్యార్థులు రూపొందించిన నూతన ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మంత్రి పరిశీలించి, పాత వాహనాల నుంచి విడిభాగాలను సేకరించి వాటిని పునర్వినియోగం చేస్తూ ఎలక్ట్రిక్ వాహనాలను ఏ విధంగా రూపొందించారు, తయారీలో ఉపయోగించిన సాంకేతిక విధానం, వాహనాల పనితీరు తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను టాటా సంస్థతో కలిసి అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. టాటా సంస్థ తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఈ సాంకేతిక కేంద్రాల అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. పాత ఐటీఐల్లో కొనసాగుతున్న సంప్రదాయ కోర్సులతో పాటు పరిశ్రమలకు ప్రస్తుతం అవసరమైన ఆధునిక సాంకేతిక కోర్సులను ఏటీసీల్లో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌కు రూ.90 కోట్లు కేటాయించిందని తెలిపారు. జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడి ప్రతినిధులతో చర్చలు జరిపినప్పుడు తెలంగాణ నుంచి శిక్షణ పొందిన యువతను పంపిస్తే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వారు ముందుకు వచ్చినట్లు చెప్పారు. మణుగూరు ప్రాంతంలో కూడా ఇదే తరహాలో నైపుణ్య, విదేశీ భాషా శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మణుగూరు ప్రాంతంలో ఐటీసీ సంస్థతో సమన్వయం చేసుకుని సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. సుమారు 100 మంది యువతకు శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ట, ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ సెంటర్స్ జాయింట్ డైరెక్టర్ నగేష్, టాంకం ఈవో గౌస్ పాషా, రతన్ టాటా ఆర్డిడి కోటేశ్వరరావు, ఏ టి సి కళాశాల ప్రిన్సిపాల్ సారంగపాణి, తహసిల్దార్ అద్దంకి నరేష్ మరియు ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ప్రభుత్వాలకు పతనం తప్పదు

**ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. నేలకొండపల్లి మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల తీరుతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా యువతను మోసం చేస్తోందని విమర్శించారు. ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా 25వ జిల్లా మహాసభలు ఆగస్టు 21న శుక్రవారం చింతకాని మండలంలోని కోదుమూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు మల్లెబోయిన ఉపేందర్ తెలిపారు. నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్య, ఉపాధి తదితర సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాలపాటి అశోక్, ఏఐవైఎఫ్ కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, పాలపాటి నవీన్,కోమ్ము అఖిల్ పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయండి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతిరెడ్డి సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం అశ్వాపురం మండలంలో సీతమ్మసాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టు కాలువలు, పంప్‌హౌస్, మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి నీరు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు కాలువలను ఫీల్డ్ ఛానళ్లు, చెరువులతో అనుసంధానం చేసి సాగునీరు అందించాలని కోరారు. రూ 2వేల కోట్లు కేటాయిస్తే 53వేల ఎకరాలకు, ప్రగళ్లపల్లి ఎత్తిపోతలతో మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అమ్మగారిపల్లి ప్రాంతంలో కోర్టు తీర్పు అనుకూలంగా ఉన్నప్పటికీ సుమారు 34,35 మంది నిర్వాసితులకు ఇంకా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. మణుగూరు, ములకలపల్లి, పాల్వంచ రూరల్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు మండలాల్లో భూసేకరణ, పరిహారం అంశాలను పరిష్కరించాలని కోరారు. సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, అన్నవరపు కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

**ప్రజాపక్షం/భద్రాచలం :** తోటి విద్యార్థులపై ర్యాంగింగ్‌కు పాల్పడే విద్యార్థులకు శిక్షలు తప్పవని మహిలా ఎస్ఐ స్వప్న అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యాంటీర్యాంగిగ్ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ హవీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్‌కు గురైతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేవచ్చన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థుల పట్ల ప్రేమానురాగాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు డాక్టర్ రాగసుమ, డా. నాగసమీర సుధాకర్, రమేష్ పూర్ణిమ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# కాలేజీ తరలింపు కుట్రకు స్వస్తి చెప్పండి

**- కలెక్టరేట్‌లో ఏఐఎస్ఎఫ్ వినతి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాకు మంజూరైన బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను తక్షణమే మానుకోవాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్క అజిత్ డిమాండ్ చేశారు. గురుకుల డిగ్రీ కళాశాల తరలింపును అడ్డుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించి సమస్యను అధికారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023లో భద్రాద్రి జిల్లా కేంద్రానికి మంజూరైన బిసి గురుకుల డిగ్రీ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా అన్నపురెడ్డిపల్లిలో శిథిలావస్తకు చేరిన పాత సత్రం భవనంలో ఏర్పాటు చేయడం శోచనీయం అన్నారు. కొత్తగూడెం సమీపంలో గల రామవరంలోని నేతాజీ పాఠశాల్లో 500 మందికి సరిపడా విశాలమైన ప్రభుత్వ భవనం అందుబాటులో ఉందని, తక్షణమే అక్కడికి తరలించి తరగతులు నడపాలని కోరారు. జిల్లా విద్యార్థుల హక్కులను కాలరాస్తూ విద్యాసంస్థను తరలించాలని చూస్తే ఊరుకోమని, జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు మర్మం ఉమా మహే,వ కళ్యాణ్ రాజేష్ శ్రీను తదితరులున్నారు.

# జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన మంత్రి వివేక్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కార్మిక గనుల శాఖామంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు మహబూబాబాద్ ఎంపి పోరిక బలరామ్ నాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులు విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన ఆరా తీసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రంథాలయాభివృద్ధికి కృషి చేస్తున్న చైర్మన్ పసుపులేటి వీరబాబు పనితీరును మంత్రి అభినందించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలు సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగం ఆదర్శం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణ వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మర్కోడు, ఆళ్లపల్లి మండలాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్కోడులో గౌడ సంఘ నాయకులు తాళ్లపల్లి వెంకన్న, యాసారపు బాబు, శ్రీరామ్ సమ్మయ్య, కోరుకొప్పుల రాజన్న మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణలో స్వయం పాలన కోసం ఉద్యమించిన పాపన్న గౌడ్ త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాల సాధనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# కోనాయిగూడెం కంపు కొడుతుంది ..!

**నెల రోజులకు ఒక్కే సారే చెత్త ట్రాక్టర్. దోమల స్వైర విహారం**

**ఎక్కడి చెత్త అక్కడే. మురుగు నీరు పారక... దుర్గందం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పాలకుల నిర్లక్ష్యం...ప్రజలకు శాపంగా మారుతుంది. మురుగు కాల్వలు శుభ్రం చేయక, చెత్త ట్రాక్టర్లు తిప్పక..చెత్త చెదారం తో నిండిన ఖాళీ స్థలాలు వెరసీ కంపు కొడుతుంది. ఇది ఎక్కడో కాదండి. నేలకొండపల్లి మండలం లోని కోనాయిగూడెం పంచాయతీ దుస్థితి, పంచాయతీ పాలకుల పట్టింపు లేక. పంచాయతీ అధికారి పర్యవేక్షణ లేక పారిశుద్ధం అధ్వానంగా మారుతుంది. పంచాయతీలో ఉన్న వీధులలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవటంతో చెత్త చెదారం పేరుకపోయి, మురుగునీరు కదలక దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామంలో ఫాగింగ్ విషయం ను ప్రజలు మరిచిపోయారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పంచాయతీ ట్రాక్టర్ చెత్త సేకరణ కోసం నెల రోజులకొకసారి మాత్రమే గ్రామంలో తిప్పుతున్నారు. దీంతో ప్రజల ఇళ్లలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తున్నారు. ప్రజలు పంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు పంచాయతీ పాలకుల పని తీరు పై చర్యలు తీసుకోవాలని, వెంటనే గ్రామంలో ఫాగింగ్ చేయించటం, మురుగు కాల్వలు శుభ్రం చేయించటం, ప్రతీ రోజు చెత్త సేకరణ కోసం పంచాయతీ ట్రాక్టర్ ను అన్ని వీధులలో తిప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రాథమిక విద్యాబోధన విద్యార్థి కేంద్రంగా ఉండాలి

**- ఎంఇఓ బెక్కంటి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రాథమిక విద్యాబోధన ఉచ్ఛ్వాస నిశ్వాస ప్రాముఖ్యతో విద్యార్థి కేంద్రంగా సాగాలని మండల విద్యాధికారి బెక్కంటి శ్రీనివాస్ అన్నారు. ఉన్నత ప్రాథమికోన్నత ప్రాథమిక కేజీబీవి ఎయిడెడ్ ప్రధానోపాధ్యాయులు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బెక్కంటి మాట్లాడుతూ బుధ, గురువారాల్లో మండల కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని, వాటిలో పాటించాల్సిన జాగ్రత్తలు, బోధన పలు అంశాలపై సూచించారు. ఈ ఏడాది మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల నమోదు అత్యధికంగా సాగిందని ఇందుకు కృషి చేసిన జాన్సన్, టి రమా, రాజా శ్రీనివాస్, పాపయ్య ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు గోపి ఆర్‌కె సిసి బేబి ఐఇఆర్‌సి పద్మ ఎంపిఎం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



**-ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించాలి**
**-మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని, ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పోలేపల్లి షిర్డిసాయినాథ్ నగర్‌లోని ఖమ్మం పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్, విఎంసి ఛైర్మన్ దివాకర టిఎస్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యా ప్రమాణాలు, విద్యార్థుల పరీక్షా ఫలితాలు, ప్రవేశాల పరిస్థితి, సహ పాఠ్య కార్యక్రమాలు, పిఎంశ్రీ కార్యక్రమాల అమలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత, విద్యాలయ అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ, అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్షించారు. గత విద్యా సంవత్సరంలో సాధించిన విద్యా ఫలితాలు, విద్యార్థుల ప్రగతి, సహ పాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలపై అధికారులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నిరంతరం అంచనా వేస్తూ వెనకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.పుస్తక పరిజ్ఞానం పెంపొందించడమే కాకుండా భవిష్యత్తులో ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలను ఎదుర్కొనేవిధంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పిఎంశ్రీ కేంద్ర విద్యాలయంలో కొత్తగా మొత్తం 256 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఒకటవ తరగతిలో 121 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం మరో 22 మందికి ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఫర్నిచర్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ పరికరాలు వంటి సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ జి. విజయలక్ష్మి, వెంకటరమణ, డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ యుగంధర్, డి. నవీన్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, పేరెంట్స్ మెంబర్ ఎం. అనిత, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయకండి

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌తో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడటం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ధ్వజమెత్తారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేయడాన్ని నిరశిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ ముసుగులో పాలిటెక్నిక్ ఐటిఐ కళాశాలల ఆస్తులను ప్రైవేటీకరించడం పూర్తిగా అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వాల ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి కార్పోరేట్ కంపెనీల్లో తక్కువ జీతాలకు పనిచేసే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమ విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పాలిటెక్నిక్ కమిటీ సభ్యులు సలిగంటి జయదీప్ రామ్‌చరణ్ సాయిరామ్ వడ్డేబోయిన యశ్వంత్ ముదిగొండ నిరీక్షణ సన్నీ స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

# లక్క పురుగుతో తాటిపూడి ప్రజల అవస్థలు

**-గోదాముల నుంచి పెద్ద ఎత్తున పురుగుల వ్యాప్తి**
**-ఇళ్లలోకి, పంట పొలాల్లోకి చేరుకున్న లక్క పురుగు**
**-శుభకార్యాల్లో అన్నం తినలేని పరిస్థితి**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామ సమీపంలోని గోదాముల నుంచి పెద్ద ఎత్తున లక్క పురుగులు వెలువడుతుండటంతో గ్రామ ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ రెండు నెలలుగా సమస్య మరింత తీవ్రరూపం దాల్చడంతో ఇళ్లలోకి పురుగులు చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిపూడి సమీపంలో సివిల్‌సప్లైకి సంబంధించిన బియ్యం, మొక్కజొన్నలను నిల్వ చేసే బారీ గోదాములు ఉన్నాయి. వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న ఈ గోదాముల్లో నెలల తరబడి నిల్వ ఉంచిన బియ్యం, మొక్కజొన్నల్లో లక్క పురుగులు వ్యాప్తి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. గోదాముల నుంచి బయటకు వస్తున్న పురుగులు చుట్టుపక్కల నుంచి బయటకు వస్తున్న పురుగులు చుట్టుపక్కల ఖాళీ స్థలాలు, ఇళ్లతో పాటు చెట్ల బెరడులకు కూడా చేరుతున్నాయని తెలిపారు.

### రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు...

లక్క పురుగులు ఇళ్లలోకి చేరడంతో ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని, రాత్రివేళల్లో ప్రశాంతంగా నిద్రపట్టడం లేదని గ్రామస్థులు



వాపోతున్నారు. గ్రామంలో శుభకార్యాలు నిర్వహించే సమయంలోను పురుగులు బెడదతో భోజనం చేయడలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైతులు, కూలీలకు తప్పని తిప్పలు...

గోదాముల సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు కూడా పురుగుల తాకిడితో ఇబ్బందులు పడుతున్నారు. గోదాముల్లో పనిచేసే హమాలీలు జీవనోపాధి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పురుగుల మధ్యే పని చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

### నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్...

గోదాముల నుంచి పెద్ద ఎత్తున లక్క పురుగులు బయటకు వస్తున్న విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా తగిన నివారణ చర్యలు కనిపించడం లేదని గ్రామ కార్యదర్శి పేర్కొన్నట్లు సమాచారం. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం, మొక్కజొన్నలను పరిశీలించి పురుగుల వ్యాప్తిని అరికట్టేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు స్పందించి గోదాములను తనిఖీ చేసి, పురుగుల నివారణకు తగిన చర్యలు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు, రైతులు మరింత ఇబ్బందులు ఎదర్కొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పలువురికి సిపిఐ నేతల పరామర్శ





**ప్రజాపక్షం/ కొణిజర్ల :** అనారోగ్యానికి గురైన పలువురిని సిపిఐ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల గుండెకు సంబంధించిన చికిత్స జరిగిన అచ్చెన శ్రీనివాసరావును సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు,జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు తదితరులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పెదమునగాల గ్రామంలోనే అనారోగ్యానికి గురై కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న ఏపూరి భాస్కర్‌రావును కూడా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. పరామర్శించిన వారిలో సిపిఐ నాయకులు సుదర్శన్, ఉపసర్పంచ్ సుంకర రాధాకృష్ణ, చింతల నారాయణ పాల్గొన్నారు.

# విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు హర్ష తేజ ఈ వైద్య శిబిరంలో పాల్గొని పలువురికి గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. అవసరమైన వారికి వైద్య సాయం అందించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఆర్. రాధాకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రుద్రవెంకట నారాయణ పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు పాపన్న గౌడ్



**ప్రజాపక్షం/ తల్లాడ :** సమాజంలో బహుజనుల ఆత్మ గౌరవం కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు తెలిపారు. సర్దార్ పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్డు సెంటర్‌లో పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం మండల అధ్యక్షులు గుండ్ల నాగయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వెనకబడిన సామాజిక వర్గాల కోసం పానన్న గౌడ్ చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మొక్కా తిరుపతిరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, గోపి, నాగేశ్వరరావు, కృష్ణార్జున్, సత్యనారాయణ, సురేష్, కృష్ణ, రాము, మల్లయ్య, అయ్యప్ప పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ తల్లాడ :** అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుండేటి వీరారెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్ లు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా మంత్రులు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సమయంలో ఓర్వలేని ప్రతిపక్షాలు బురద జల్లే కార్యక్రమం చేపట్టడం సరికాదన్నారు. కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను ఆపు చేయాలని బిఆర్ఎస్ నాయకులే కోర్టులో వేశారని మరల బిఆర్ఎస్ నాయకులే రోడ్డెక్కి ధర్నాలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుండేటి వీరారెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, మంగాపురం ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము, శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, అబ్రహం రెడ్డి పాల్గొన్నారు.

# అవసరాల ఆధారిత కనీస వేతనాలకై పోరాడుదాం




**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం జిల్లా కేంద్రంలో ఆగస్టు 20న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆగస్టు 18న తల్లాడ మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకి కనీస వేతనం 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్దేశించిన శాస్త్రీయ నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధమైన కనీస వేతనాన్ని ఏ శాస్త్రీయ ప్రాతిపదికన నిర్ణయించాలో, గౌరవ ప్రదంగా జీవించే కనీస వేతనాన్ని లెక్కించడానికి అనుసరించవలసిన పద్ధతిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఖమ్మంజిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్‌మియా, తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు పఠాన్, నాగుల మీరా, రమణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, మైసారావు, రాఘవ, సత్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.